# సీఈవోని తొలగించాల్సిందే

## ఈజీఎంలో ఓటు చేసిన బైజూస్ షేర్‌హోల్డర్లు

ముంబై, ఫిబ్రవరి 23: ఎడ్‌టెక్ కంపెనీ బైజూస్ వ్యవస్థాపకుడు, సీఈవో బైజూ రవీంద్రన్‌ను, ఆయన కుటుంబ సభ్యుల్ని యాజమాన్య స్థానాల నుంచి, డైరెక్టర్ల బోర్డు నుంచి తొలగించాలంటూ ఆ సంస్థ వాటాదారులు ఏకగ్రీవంగా ఓటు చేశారు.పలు అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ కంపెనీని నడుపుతున్న బైజూ రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యుల్ని సాగనంపేందుకు కొంతమంది ఇన్వెస్టర్లు డిమాండ్ చేసిన అత్యవసర సర్వసభ్య సమావేశం (ఈజీఎం)శుక్రవారం జరిగింది. వారి తొలగింపునకు ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా ఇందుల్లో పాల్గొన్న షేర్‌హోల్డర్లందరూ ఓటు చేశారు. ఈజీఎంకు పిలుపునిచ్చిన ఇన్వెస్టింగ్ సంస్థలకు బైజూస్‌లో 32 శాతం పైగా వాటా ఉంది. ఫేస్‌బుక్ చీఫ్ మార్క్ జుకర్‌బర్గ్ సతీమణి చాన్ జుకర్‌బర్గ్‌తో సహా కొన్ని విదేశీ ఫండ్స్ ప్రస్తుత యాజమాన్యాన్ని వ్యతిరేకిస్తున్నాయి. రవీంద్రనాథ్, ఆయన కుటుంబ సభ్యులకు బైజూస్ ప్రమోటింగ్ కంపెనీ థింక్ అండ్ లెర్న్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 26.3 శాతం వాటా ఉంది.ఈజీఎంను నిలుపుచేయాలని రెండు రోజుల క్రితం బైజూస్ కర్నాటక హైకోర్టును ఆశ్రయించగా, అందుకు కోర్టు నిరాకరించింది. అయితే ఈజీఎంలో ఆమోదించిన ఎటువంటి తీర్మానాన్ని అయినా తదుపరి విచారణలోగా అమలు చేయరాదని కర్నాటక హైకోర్టు ఆదేశించినందున, మార్చి 13 వరకూ ఈ తీర్మానం అమలుకాదు. యాజమాన్యాన్ని తొలగించాలన్న తీర్మానమే కాకుండా మరో ఆరు తీర్మానాలకు అనుకూలంగా మెజారిటీ షేర్‌హోల్డర్లు ఓటు చేశారు. బోర్డును పునర్‌వ్యవస్థీకరించడం, యాజమాన్యాన్ని మార్చడం, కంపెనీ చేసిన టేకోవర్లపై థర్డ్ పార్టీతో ఫోరెన్సిక్ దర్యాప్తు జరిపించడం వంటివి ఈ తీర్మానాల్లో ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

### ఈ ఓటింగ్ చెల్లదు: కంపెనీ

థింక్ అండ్ టెర్న్ బోర్డులో వ్యవస్థాపక సీఈవో రవీంద్రనాథ్ బైజూ, ఆయన భార్య, సోదరుడు..ఈ ముగ్గురు కుటుంబ సభ్యులు ఉన్నారు. వీరంతా ఈజీఎంకు హాజరుకాలేదు. వ్యవస్థాపకులు హాజరుకాని ఈ సమావేశంలో ఆమోదించిన ఓటు చెల్లనేరదని, పనికిరాదని కంపెనీ ప్రకటించింది. ఈజీఎం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభంకాగా, కొంతమంది బైజూస్ ఉద్యోగులతో సహా 200 మంది వర్చువల్ సమావేశంలో పాల్గొంటామని రావడంతో ఒక గంట పాటు జాప్యం జరిగింది. ఇన్వెస్టర్లను పూర్తిగా వెరిఫై చేసిన తర్వాత ఇన్వెస్టర్ల ప్రతినిధులైన 40 మందినే సమావేశంలోకి అనుమతించారు. బైజూస్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ (ఏవోఏ)లో ఆర్టికల్స్ 38, 39 (ఏ) ప్రకారం తీర్మానాలు ఆమోదం పొందాలంటే కనీసం ఒక వ్యవస్థాపక డైరెక్టరు హాజరుకావాల్సి ఉంటుందని కంపెనీ తెలిపింది. సమావేశంలో వ్యవస్థాపకులెవరూ పాల్గొనని కారణంగా తీర్మానాలన్నీ చెల్లవని తెలిపింది.అలాగే పక్షపాతంతో ఏర్పాటైన ఈజీఎంలో మొత్తం షేర్‌హోల్డర్లలో 20 శాతం మందే పాల్గొన్నారని కంపెనీ ఆరోపించింది. కానీ కంపెనీ షేర్‌హోల్డర్ల సంఖ్యను ప్రస్తావించింది తప్ప వారికి ఉన్న వాటాల శాతాన్ని చెప్పకపోవడం గమనార్హం.




### ఎన్సీఎల్టీలో పిటిషన్

ప్రస్తుత యాజమాన్యాన్ని మొత్తం ఆరుగురు ఇన్వెస్టర్లు వ్యతిరేకిస్తుండగా, అందులో నలుగురు ఈజీఎంకు ముందు రోజునే బైజూస్ యాజమాన్య దుర్వినియోగంపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ) బెంగుళూరు బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. కంపెనీని నడపడానికి సీఈవో బైజు రవీంద్రన్‌తో కుటుంబ సభ్యులు కంపెనీని నడపడానికి అనర్హులుగా ప్రకటించాలని, కొత్త బోర్డును నియమించాలని, అకౌంట్స్ ఫోరెన్సిక్ ఆడిట్‌కు ఆదేశించాలని ఎన్సీఎల్టీని విన్నవించారు.

# కరిగిన ఫారెక్స్ రిజర్వులు



- రెండు నెలల కనిష్ఠస్థాయికి నిల్వలు

ముంబై, ఫిబ్రవరి 23: విదేశీ మారకం నిల్వలు తరిగిపోయాయి. గత కొన్ని వారాలుగా పెరుగుతూ వచ్చిన ఫారెక్స్ రిజర్వులు రెండు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ తగ్గడంతో గతవారాంతానికి ఫారెక్స్ రిజర్వులు 1.13 బిలియన్ డాలర్లు తగ్గి 616.10 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితం వారంలో రిజర్వులు 5.3 బిలియన్ డాలర్లు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఆస్తుల విలువ 740 మిలియన్ డాలర్లు తరిగిపోయి 545.78 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. పసిడి రిజర్వులు 362 మిలియన్ డాలర్లు తరిగిపోయి 47.38 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి వద్ద ఉన్న నిల్వలు మిలియన్ డాలర్లు తగ్గి 4.83 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సెప్టెంబర్ 2021లో రికార్డు స్థాయి 642.45 బిలియన్ డాలర్లకు చేరుకున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మార్కెట్లో కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావడంతో రిజర్వుబ్యాంక్ డాలర్లను కొనుగోలు చేసింది.

# ఇక ప్రయాణాలకు చెల్లింపులు సులభతరం

**టికెట్ల కొనుగోలుకు ప్రీపెయిడ్ సాధనాలు • బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు జారీచేసేందుకు ఆర్బీఐ అనుమతి**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: బస్సులు, రైళ్లు తదితర ప్రజా రవాణా వ్యవస్థల్లో ఇక నుంచి నగదుతో పని లేకుండా, చిల్లర సమస్యలు లేకుండా ప్రయాణాలకు చెల్లింపులు సులభతరం కానున్నాయి. ఈ మేరకు వినియోగదారులకు ప్రీపెయిడ్ సాధనాల్ని జారీచేయడానికి బ్యాంక్‌లు, నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలను (ఎన్‌బీఎఫ్‌సీలు) రిజర్వ్‌బ్యాంక్ అనుమతించింది. ఈ సాధనాలు అమలులోకి వస్తే ప్రయాణీకులు వారి టికెట్లను నగదుతోనే కాకుండా వీటి ద్వారా కొనుగోలు చేయవచ్చు. ఈ సాధనం ద్వారా సౌలభ్యం, వేగం, డిజిటల్ చెల్లింపు భద్రత లభిస్తుందని శుక్రవారం ఆర్బీఐ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

# పేటీఎం యాప్ పనిచేసేలా చూడండి

- ఎన్‌పీసీఐని కోరిన ఆర్బీఐ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రిజర్వ్‌బ్యాంక్ నిషేధానికి గురైన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు చెందిన పేటీఎం యాప్ ఇకముందు కూడా పనిచేసేలా చూడాలంటూ నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ను కేంద్ర బ్యాంక్ కోరింది. పేటీఎం యాప్ నుంచి యూపీఐ ద్వారా చెల్లింపుల్ని కొనసాగించేందుకు దానిని ఒక థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్‌ను చేసే అవకాశాల్ని పరిశీలించమని ఎన్‌పీసీఐని కోరినట్టు ఆర్బీఐ శుక్రవారం తెలిపింది. 2024 మార్చి 15 తర్వాత పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ తన ఖాతాదారులు, వ్యాలెట్లలో నగదు జమచేసుకోరాదంటూ ఆర్బీఐ నిషేధం విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నిర్వహించే పేటీఎం హ్యాండిల్‌ను ఉపయోగించుకుని యూపీఐ కస్టమర్లు నిరంతరాయంగా డిజిటల్ చెల్లింపులు జరుపుకోవాలన్న లక్ష్యంతో పేటీఎం యాప్ థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ)గా వ్యవహరించే అంశాన్ని పరిశీలించాలని ఎన్‌పీసీఐకి కోరినట్టు రిజర్వ్ బ్యాంక్ వివరించింది. టీపీఏపీగా వ్యవహరించే అనుమతిని ఇవ్వాలంటూ పేటీఎం మాతృసంస్థ ఒన్ 97 కమ్యూనికేషన్ విజ్ఞప్తి చేసినట్టు ఆర్బీఐ ప్రకటన తెలిపింది. అలాగే పేటీఎం హ్యాండిల్ నుంచి ఇతర బ్యాంక్‌లకు కస్టమర్లు మారడానికి వీలయ్యేలా అధిక పరిమాణంతో యూపీఐ లావాదేవీల్ని ప్రాసెస్ చేయగలిగే సామర్థ్యం ఉన్న 4-5 బ్యాంక్‌లకు ఎన్‌పీసీఐ సర్టిఫికేషన్ ఇస్తుందని రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది.



# సీఎంఆర్ ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్


హైదరాబాద్, ఫిబ్రవరి 23: దుస్తుల, ఆభరణాల విక్రయ సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రచారకర్తగా ప్రముఖ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. ఇప్పటికే సినీ నటుడు రామ్ పోతినేని బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. వస్త్ర, స్వర్ణాభరణాల రంగంలో 40 ఏండ్లకు పైగా తమకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్న సీఎంఆర్... వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా అద్భుతమైన డిజైన్లను అందిస్తున్న సీఎంఆర్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులవడం చాలా సంతోషంగా ఉన్నదని మృణాల్ ఠాకూర్ తెలిపారు. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు తగ్గట్టుగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్లతో అన్నీ ఒకేచోట అందరికీ అందుబాటు ధరలు అందిస్తున్నట్లు సీఎంఆర్ షాపింగ్ మాల్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు.

## హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ 18 స్టోర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 23: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్..హైదరాబాద్‌లో ఒకేసారి 18 నూతన స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం స్టోర్ల సంఖ్య 68కి చేరుకున్నాయి. ఈ స్టోర్లలో కంపెనీకి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులతోపాటు ఎక్స్‌ట్రీమ్, ఎక్స్‌సేఫ్, 5జీ ప్లస్‌తోపాటు మొబైల్ బ్రాడ్‌బ్యాండ్, డీటీహెచ్ సేవలకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చునని భారతీ ఎయిర్‌టెల్ ఏపీ-తెలంగాణ సీఈవో శివన్ భార్గవ తెలిపారు.

## 6 పైసలు తగ్గిన రూపాయి

ముంబై, ఫిబ్రవరి 23: రూపాయి విలువ పడిపోయింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 6 పైసలు పడిపోయి 82.91 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో రూపాయి పడిపోవడానికి ప్రధాన కారణమని ఫారెక్స్ ట్రేడర్లు వెల్లడించారు. 82.87 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు ఒక దశలో 82.84 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది.






# సెల్టోస్ 4,358 కార్ల రీకాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: కియాకు చెందిన మధ్యస్థాయి స్పోర్ట్స్ యుటిలిటీ వాహనమైన సెల్టోస్ 4,358 యూనిట్ల వాహనాలను రీకాల్ చేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. గతేడాది ఫిబ్రవరి 28 నుంచి జూలై 13 లోగా తయారైన పెట్రోల్ సెల్టోస్‌లో ఎలక్ట్రానిక్ ఆయిల్ పంప్ కంట్రోలర్‌ను మార్చేందుకు ఈ రీకాల్ చేస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఎలక్ట్రానిక్ ఆయిల్ పంప్ కంట్రోలర్ పనితీరుపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ లోపం ఉన్న మాడళ్లలో ఉచితంగానే రీప్లేస్ చేస్తామని, ఇప్పటికే కారు యాజమానులకు సమాచారం ఇచ్చింది.

# నిఫ్టీ మరో రికార్డు

## ఇంట్రాడేలో 22,297 స్థాయికి..

ముంబై, ఫిబ్రవరి 23: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలకు ఐటీ, బ్యాంకింగ్ షేర్లు గండికొట్టాయి. దీంతో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో వారాంతం ట్రేడింగ్‌లో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 15.44 పాయింట్లు తగ్గి 73,142.80 పాయింట్లకు జారుకున్నది. ఇంట్రాడేలో రికార్డు స్థాయి 22,297 పాయింట్లను తాకిన నిఫ్టీ చివరకు 4.75 పాయింట్లు కోల్పోయి 22,212.70 వద్ద ముగిసింది. వారాంతం ట్రేడింగ్‌లో హెచ్‌సీఎల్ టెక్, ఏషియన్ పెయింట్స్, మారుతి, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టీసీఎస్, ఎస్బీఐ, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్‌లు నష్టపోగా..బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ఎల్‌అండ్‌టీ, విప్రో షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్, ఎనర్జీ, బ్యాంకింగ్ రంగ సూచీలు నష్టపోయాయి. కానీ, ఇండస్ట్రీయల్స్, టెలి కమ్యూనికేషన్స్, క్యాపిటల్ గూడ్స్, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు ఒక్క శాతం పెరిగి 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది.

### 2 లక్షల కోట్లు దాటిన జియో ఫిన్




రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియో ఫిన్ సర్వీసెస్ మరో రికార్డును సాధించింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.2 లక్షల కోట్లు దాటి రూ.2.20 లక్షల కోట్లకు చేరుకున్నది. శుక్రవారం ఇంట్రాడేలో 15 శాతం వరకు లాభపడిన కంపెనీ షేరు ధర చివరకు 10.18 శాతంతో రూ.333.90 వద్ద ముగిసింది. అటు ఎన్‌ఎస్‌ఈలోనూ కంపెనీ షేరు 10.62 శాతం ఎగబాకి రూ.335కి చేరుకున్నది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.27, 922.69 కోట్లు ఎగబాకి రూ.2,20,458.96 కోట్లకు చేరుకున్న విలువ చివరకు రూ.2,12,136.16 కోట్ల వద్ద ముగిసింది. అలాగే రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ కూడా రూ.20,20,470.88 కోట్లకు చేరుకున్నది. రిలయన్స్ షేరు ధర 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నది.





TEJASWI AUTOMOBILES: Hi Tech City, Madhapur, Sangareddy, Siddipet, Zaheerabad: 7506025271; Tolichowki: 8879136935
VENKATARAMANA MOTORS: Gachibowli: 7506025211; BOL, Kushaiguda: 7506025320; Vanasthalipuram: 7506025358; Jubilee Hills: 8879334329; Kukatpally: 8879221046, Vikarabad, Tandur: 8879208240
JASPER INDUSTRIES: SD Road, Secunderabad: Kompally: 9619024718; Narsingi: 8879152707; Chandrayangutta: 9167450755
ORANGE AUTO: Attapur: 9167473372; Erragadda: 7506025174; Kharkana: 8291244717; Medchal, Medak: 7506025493
MALIK CARS: Malakpet: 7506025166; Himayathnagar: 7506025158; Bowenpally: 7506025486
PRATHAMMALIK AUTOMATRIX: Banjara Hills: 8291058022; Boduppal: 9000979434; Financial District (Near Q City): 9167090503
SELECT CARS: Nagole: 7506025176; Chandanagar: 7506025180; Begumpet: 7506025220; Bachupally: 8107413840; Karmanghat: 9619083948


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.